వైభవంగా లక్ష్మీనరసింహుడి తిరుకల్యాణం

యాదగిరిగుట్ట, జూలై 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటిక లింగేశ్వరుడికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.18,74,858 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్పటికలింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న పురోహితులు

సినారెకు ఘన నివాళి

మోత్కూరు, జూలై 29 : తెలంగాణ సాహిత్యాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని ప్రజాభారతి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయంలో సినారె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహిత్యం బలోపేతానికి ఆయన చేసిన కృషిని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా భారతి సంస్థ అధ్యక్షుడు దేవినేని అరవిందరాయుడు, ప్రధాన కార్యదర్శి గుమిడెల్లి వెంకన్న, కోశాధికారి గాదె వెంకటేశ్వర్లు, ప్రతినిధులు మర్రి జయశ్రీ, ప్రసాద్, ఉప్పలయ్య, హనుమంతు, గ్రంథాలయ మాజీ చైర్మన్ కోమటి మత్స్యగిరి, ఇన్‌చార్జి బాబుచారి పాల్గొన్నారు.

సినారె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ప్రజాభారతి ప్రతినిధులు

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి

- భువనగిరి మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, జూలై 29 : వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని 15, 28, 30వ వార్డుల్లో జనరల్ ఫండ్ రూ.20లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ సలావుద్దీన్, పాలిశెట్టి అనిల్ కుమార్, పస్తువుల సాయికిరణ్, సన్నీ, నరేశ్, రాజు, అధికారులు, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

రైతు భరోసా వెంటనే ఇవ్వాలి : బీఆర్ఎస్

ఆత్మకూరు(ఎం), జూలై 29 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతుల ఖాతాల్లో రైతు భరోసా వెంటనే జమ చేయాలని బీఆర్ఎస్ రైతు విభాగం మండలాధ్యక్షుడు పుట్ట నర్సిరెడ్డి అన్నారు. మండలంలోని కూరెళ్లలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధును సకాలంలో అందించిందని, దాంతో రైతులు సంతోషంగా సాగుచేసి అధిక పంటలు పండించి లాభాలు పొందారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు గడుస్తున్నా రైతుభరోసాను అందివ్వకుండా రైతులను మోసం చేసిందని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ కూడా గందరగోళంగా ఉన్నదని, అర్హులైన రైతులందరికీ ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బాషబోయిన ఉప్పలయ్య, గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎరుకల స్వామిగౌడ్, గడ్డం అశోక్, నాయకులు కూరెళ్ల రమేశ్, శంకర్ పాల్గొన్నారు.


కూరెళ్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రైతు విభాగం మండలాధ్యక్షుడు నర్సిరెడ్డి

చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలి

- సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

రాజాపేట, జూలై 29 : రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ బిల్లులను చెల్లించాలని ఆగస్టు 2న చేపట్టే చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచులు అప్పులు చేసి మరీ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారని, బిల్లులు రాక అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక కొంత మంది సర్పంచులు ఆత్మహత్యలు సైతం చేసుకున్నారని తెలిపారు. బిల్లులు తక్షణమే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచులు పంబ కరుణాకర్, బూర్గు నర్సిరెడ్డి, రాములునాయక్, చెరుకు కనకయ్య పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి : ఎమ్మార్పీఎస్

మోత్కూరు, జూలై 29 : ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొంపెల్లి భాస్కర్ అన్నారు. ఆగస్టు 9న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలను పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా 11 సంవత్సరాలుగా కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. తాము 30 ఏండ్లుగా వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆగస్టు 9న చలో ఢిల్లీ కార్యక్రమంలో పార్టీలకతీతంగా మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కూరెళ్ల రమేశ్, నాయకులు బి.శ్రీను, కె.చిన్న పాల్గొన్నారు.


చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అధ్యయనాలు తోడ్పాటు

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్
- గ్రామ సందర్శనకు వచ్చిన కేంద్ర బృందం సభ్యులు
- ఐదు రోజులపాటు పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఓ ఎంఏ కృష్ణన్

భువనగిరి కలెక్టరేట్, జూలై 29 : గ్రామ స్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో మెరుగైన సేవలు అందించడానికి అధ్యయనాలు తోడ్పడుతాయని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్ అన్నారు. సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్‌కు సంబంధించిన 24మంది అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు గ్రామ సందర్శనలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశమై జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీఆర్‌డీఓ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మరింత చేరువగా, వేగంగా అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఇలాంటి అధ్యయనాలు ఉపకరిస్తాయన్నారు. సోమవారం నుంచి ఆగస్టు 2వరకు జిల్లాలోని తుర్కపల్లి మండలం ధర్మారం, రాజాపేట మండలం దూది వెంకటాపురం, యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్, మోటకొండూరు మండలం వర్టూరు, రామన్నపేట మండలం ఇస్కిళ్ల గ్రామాల్లో గ్రామానికి ఐదుగురు చొప్పున ఐదు రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనం చేస్తారని తెలిపారు. గ్రామ పంచాయతీ, పౌర కేంద్రీకృత విలువలను పెంపొందించడం, సామాజిక, గ్రామీణ సమాజ గతిశీలతను ప్రత్యక్షంగా అర్థం చేసుకోవడం, సాధారణ వ్యాధులను విశ్లేషించడానికి, వాటిపై గ్రామస్తుల్లో అవగాహన చేపట్టడం ఇందులో భాగమన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యకలాపాలు, వివిధ ప్రాసెసింగ్ యూనిట్లను, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన విధానాలను తెలుసుకోవడం, స్థానిక అవసరాలు, అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించడం, అంచనా వేయడం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, సహకారాన్ని సులభతరం చేయడానికి గ్రామస్తులతో సాన్నిహిత్యం పెంచుకుంటారని తెలిపారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా వృత్తిపరమైన నైపుణ్యాలు, అందుకు కావాల్సిన వనరులను తెలుసుకుని గ్రామీణ సంస్కృతి, ప్రజల జీవనోపాధుల పట్ల, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి, సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని వర్తింపజేయడానికి అవసరమైన వనరులపై దృష్టి పెడుతారన్నారు. గ్రామీణ పాలనపై సమగ్ర దృక్పథాన్ని పెంపొందించడం, సుస్థిరత, సమాజ భాగస్వామ్య సూత్రాలపై ఆచరణ.. గ్రామీణ పేదలు, భూమి లేని కూలీల సమస్యలు, ఇబ్బందులను గుర్తిస్తారని తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్య స్థాయిని గుర్తించి వివరించడం, ప్రభుత్వేతర సంస్థల కార్యాచరణ ఫలితంగా ప్రజల జీవనం, గ్రామంలో సంభవించిన మార్పులను విశ్లేషించడం ఈ అధ్యయనం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రతినిధి పి.వెంకటేశ్వర్లు, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి జ్యోతికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్, జిల్లా ఎస్సీ సంక్షేమ అభివృద్ధి అధికారి జయపాల్ రెడ్డి, డీపీఓ అనూరాధ, జిల్లా సహకార శాఖ అధికారి ప్రవీణ్, అదనపు డీఆర్‌డీఓ సురేశ్, ఎంపీడీఓలు, ఏపీడీలు పాల్గొన్నారు.

దూదివెంకటాపురంలో కేంద్ర శిక్షణ బృందం పర్యటన

రాజాపేట, జూలై 29 : మండలంలోని దూదివెంకటాపురం గ్రామాన్ని కేంద్ర అసిస్టెంట్ సెక్షన్ అధికారులు సోమవారం సందర్శించారు. ఫౌండేషన్ శిక్షణలో భాగంగా గ్రామంలో ఐదు రోజుల పాటు వ్యవసాయం, విద్యుత్ సరఫరా, కమ్యూనికేషన్, ప్రజల ఆర్థిక స్థితిగతులపై ఇంటింటి సర్వే చేయనున్నారు. కార్యక్రమంలో కేంద్ర అసిస్టెంట్ సెక్షన్ అధికారులు ప్రతిక్‌దలాల్, చిప్పు కుమార్, కుల్‌దీప్, వికాశ్ మోహన్‌రామ్ అవనీత్‌గుప్తా, ఎంపీడీఓ నాగవేణి, పంచాయతీ కార్యదర్శి గాంధీ పాల్గొన్నారు.

దూదివెంకటాపురంలో కేంద్ర అసిస్టెంట్ సెక్షన్ అధికారులు

సబ్ కోర్టును రామన్నపేటలోనే ఏర్పాటు చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకుల డిమాండ్

రామన్నపేట, జూలై 29 : రామన్నపేటకు మంజూరైన సబ్ కోర్టును వేరే ప్రాంతానికి తరలించవద్దని, ఇక్కడే ప్రారంభించి ప్రజలకు న్యాయ సేవలు అందించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రామన్నపేటకు మంజూరైన సబ్ కోర్టును చౌటుప్పల్‌కు తరలించాలనే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. రామన్నపేటలో 42 సంవత్సరాలుగా పరిసర మండలాల ప్రజలకు సేవలందిస్తున్న కోర్టులకు అదనపు కేసులు వస్తుండటంతో సీనియర్ సివిల్ కోర్టు (సబ్ కోర్టు) మంజూరు అయ్యిందన్నారు. దీనికి రెవెన్యూ అధికారులు 5ఎకరాల భూమిని కేటాయించారని తెలిపారు. ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకొని కోర్టును ప్రారంభించాలని, లేకుంటే అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దీన్, బీజేపీ మండలాధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, సీపీఐ మండల నాయకుడు శివరాత్రి సమ్మయ్య, టీడీపీ నాయకుడు మిర్జా ఫజల్‌బేగ్, ఆయా పార్టీల నాయకులు జెల్లెల పెంటయ్య, బందెల రాములు, బొడ్డుపల్లి వెంకటేశం, వేమవరపు సుధీర్‌బాబు, కమ్మంపాటి శ్రీనివాస్, అశోక్, మల్లికార్జున్, ఎస్‌కే చాంద్, నరేందర్, వెంకట్‌రెడ్డి, హన్మంతు, శ్రీనివాస్, జగతయ్య, ఆనంద్, అంజయ్య పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత అశోక్‌రెడ్డి

వేతనాలు పెంచాలని కాంట్రాక్టు కార్మికుల సమ్మె

భువనగిరి అర్బన్, జూలై 29 : జీఓ 60 ప్రకారం తమ వేతనాలు పెంచాలని ఏరియా దవాఖానలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట సోమవారం సమ్మెకు దిగారు. వేతనాల పెంపునకు కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు అంగీకరించడంతో సమ్మె విరమించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ తమ సంఘం పోరాటాల ఫలితంగానే మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెరిగాయన్నారు. ప్రభుత్వ జీఓను కాంట్రాక్టు సంస్థ అమలు చేయకపోవడంతో కార్మికులు సమ్మెకు దిగారన్నారు. ఈ క్రమంలో దవాఖాన ఏఓ మసూద్, టీవీటీ ఏజెన్సీ ప్రతినిధి శ్రీనివాస్‌తో చర్చలు జరిపామని తెలిపారు. కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల వేతనాలు రూ.10,500కు పెంచుతామని, 3నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇస్తామని, ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా చెల్లిస్తామని, 3 షిఫ్టుల విధానాన్ని అమలు చేస్తామని, వేతనాలు ప్రతి నెలా 5న చెల్లించేందుకు ఏజెన్సీ ప్రతినిధులతో ఒప్పందం కుదిరిందని చెప్పారు. సమ్మెకు సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సామల శోభన్‌బాబు, జిల్లా కమిటీ సభ్యుడు సామల భాస్కర్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

ఆర్థిక సాయం

వలిగొండ, జూలై 29 : మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన పోలేపల్లి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన పైళ్ల షాలినీ వెంకట్‌రెడ్డి సమకూర్చిన 10వేల రూపాయలను మృతుడి కుటుంబ సభ్యులకు సోమవారం గ్రామస్తులు అందజేశారు. శివయ్య, సత్యనారాయణరెడ్డి, రాజేందర్‌రెడ్డి, స్వామి, రాములు, దశరథ, పరిపూర్ణాచారి, రమేశ్, జహంగీర్, నర్సింహ, మల్లేశం పాల్గొన్నారు.

బీబీనగర్ : మండలంలోని వెంకిర్యాల గ్రామానికి చెందిన గద్దె బుచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాల భాస్కర్ బుచ్చయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు నర్సింహ, అశోక్ పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి..

రాజాపేట : మండలంలోని నెమిలె గ్రామానికి చెందిన పండుగ రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. రాజుతో కలిసి చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.9వేల ఆర్థిక సాయం అందజేశారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రానికి చెందిన నూతి సత్తమ్మ ఇటీవల మృతిచెందారు. సత్తమ్మ కొడుకు నూతి సైదులుతో కలిసి చదువుకున్న పదో తరగతి స్నేహితులు సోమవారం ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ.12వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఓరుగంటి లింగస్వామి, నీళ్ల శివ, గవ్వల నాగరాజు, బద్దుల మల్లేశ్ పాల్గొన్నారు.

పాంచ్ పీర్ దర్గా అబ్దుల్ ఖుద్దుస్ జగద్గురు బాబా మృతి



రాజాపేట, జూలై 29 : మండలంలోని రఘునాథపురం లాల్‌షా బాజ్ ఖాలందర్ ఖాన్‌ఖా మౌలాలీ ముషికల్ ఖుషా పంజాతానే పీర్ దర్గా అలీషా సయ్యద్ అబ్దుల్ ఖుద్దుస్ జగద్గురు బాబా (54) హైదరాబాద్‌లోని బీజేఆర్ నగర్‌లో సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మంగళవారం రఘునాథపురంలో బాబా అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.

వైద్యాధికారి లేక రోగుల ఇబ్బందులు

- పీహెచ్‌సీలో 10రోజుల నుంచి వైద్యాధికారి పోస్ట్ ఖాళీ

ఆత్మకూరు(ఎం)లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆత్మకూరు(ఎం), జూలై 29 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి లేకపోవడంతో జ్వర పీడితులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో వైద్యం కోసం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. ఇంతకు ముందు వైద్యాధికారి అందుబాటులో ఉండడంతో మెరుగైన వైద్యం అందించారు. కానీ.. వైద్యాధికారి విలియం కేరీ ఇటీవల బదిలీపై యాదగిరిగుట్ట పీహెచ్‌సీకి వెళ్లారు. ఆమె బదిలీ అయి 10 రోజులు గడుస్తున్నా ఇక్కడ మండల వైద్యాధికారి లేకపోవడంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. వైద్య సిబ్బంది మొక్కుబడిగా బీపీ చెక్ చేసి కొన్ని మందులు ఇచ్చి పంపుతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలే..

ఈ నెల 27న జిల్లా కలెక్టర్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకులు ఇద్దరు వైద్యాధికారులను నియమించి ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అయినా.. నేటికీ పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల మందులు, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇద్దరు వైద్యాధికారులను నియమించి, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్యం అందించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలంటున్నారు.

టీటీ ఇంజక్షన్లు లేవంటున్నారు



కాలుకు ఇన్ఫెక్షన్ కావడంతో సోమవారం ఆరోగ్య కేంద్రానికి వచ్చా. వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో అక్కడే ఉన్న ఏఎన్ఎం కొన్ని మందులు, అయిట్‌మెంట్ ఇచ్చారు. టీటీ ఇంజక్షన్ లేదని, బయట కొనుక్కోవాలని చిట్టి రాసిచ్చారు. సంబంధిత అధికారులు స్పందించి రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి.

– రాగటి సురేశ్, కొరటికల్

రెడ్ క్రాస్ భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

మోత్కూరు, జూలై 29 : జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్, కార్యాలయం నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో విన్నవించారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో సోమవారం అయిలయ్యను రెడ్ క్రాస్ ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో భవన నిర్మాణం కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించిందన్నారు. ఆర్డీఓ స్థల పరిశీలన చేసి సర్వే కూడా చేశారని తెలిపారు. స్థలాన్ని రెడ్ క్రాస్ సంస్థకు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు రావుల మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అంజయ్య, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హమీద్, ఎస్ఎన్ చారి, ఎండీ ఖలీల్ కె.నర్సిరెడ్డి, మత్స్యగిరి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ అయిలయ్యకు వినతి పత్రం ఇస్తున్న రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రతినిధులు

పలు కుటుంబాలకు గొంగిడి మహేందర్‌రెడ్డి పరామర్శ

అమ్మనబోలులో నర్సయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

మోటకొండూర్, జూలై 29 : మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన సామ దేశమ్మ, ఎండీ జమాల్, క్యాసగల్ల నర్సయ్య, సంపంగి నరసింహ ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలను డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం చెప్పారు. ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బీస భిక్షపతి, నాయకులు నాయిని రామచంద్రారెడ్డి, కృష్ణంరాజుగౌడ్, మల్లేశ్‌యాదవ్, జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

- సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

రాజాపేట, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సీపీఐ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ ఇచ్చిన గడువులోపు రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేయాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య, మండల కార్యదర్శి లింగం, నాయకులు నర్సింహులు, బాలనర్సయ్య, రాములు, ఉప్పల్‌రెడ్డి, భిక్షపతి, అయిలయ్య, ప్రవీణ్, కరుణాకర్, హరినాథ్, మహేశ్, సిద్ధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

'రఘునాథపురాన్ని మండలంగా ప్రకటించాలి'

రాజాపేట, జూలై 29 : కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ మేరకు రఘునాథపురాన్ని ప్రత్యేక మండలంగా ప్రకటించాలని బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండం రాజు డిమాండ్ చేశారు. గ్రామంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రఘునాథపురాన్ని మండలంగా ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం కొనసాగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మండలం ఏర్పాటు తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు ఉన్న రఘునాథపురాన్ని మండలంగా ప్రకటించాలని, లేకుంటే నిరసన దీక్షలు చేపడుతామని హెచ్చరించారు.

సమావేశంలో నాయకులు గుర్రం సిద్ధిరాములు, కటకం స్వామి, కటకం వెంకటేశం, పల్లె ప్రవీణ్‌కుమార్‌గౌడ్, బింగి అశోక్, రాజు, నాగభూషణం పాల్గొన్నారు.

రఘునాథపురంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎన్నికల హామీలను అమలు చేయాలి : సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్

ఆలేరు రూరల్, జూలై 29 : ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ అన్నారు. ఆలేరు పట్టణంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సైదాపురం గ్రామానికి వచ్చినప్పుడు రెవెన్యూ డివిజన్‌గా చేస్తానని ప్రకటించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆలేరును వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు చౌడబోయిన కనకయ్య, స్వామి, ప్రవీణ్, లింగం, రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

యాదగిరిగుట్ట, జూలై 29 : మున్సిపాలిటీలోని పాతగుట్టలో రూ.2.50 లక్షలతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మున్సిపల్ కౌన్సిలర్ దండబోయిన అనిల్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపరుస్తామని, సీసీ రోడ్డు నిర్మిస్తామని అన్నారు. పాతగుట్టకు వచ్చే భక్తులకు అసౌక్యం కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శాగంటి సత్తయ్య, పాండు రాజు, శ్రీను, ఉప్పలయ్య, పరశురాం, వెంకటేశ్, గిరి, మధు, సదానందం పాల్గొన్నారు.


అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ అనిల్‌కుమార్

ఘనంగా మల్లన్న పండుగ

భూదాన్ పోచంపల్లి, జూలై 29 : మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో సోమవారం మల్లన్న పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మల్లన్న కల్యాణోత్సవాన్ని సాంప్రదాయకంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కళాకారులు మల్లన్న కథను వినిపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దుర్గం స్వప్నానరేశ్, మాజీ ఎంపీటీసీ చిల్లర జంగయ్యయాదవ్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

దేశ్‌ముఖి గ్రామంలో మల్లన్న పండుగలో పాల్గొన్న భక్తులు